ఈనాడు
నిజామాబాద్
శనివారం సెప్టెంబరు 28, 2024

● నేడు రేబిస్ నియంత్రణ దినోత్సవం

కుక్క కాటు... ఇది మన గల్లీలో ఉండేది అనుకుంటున్నాం. విశ్వ సమస్య. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ కుక్కతో వ్యాప్తి చెందే రేబిస్‌తో మరణాలను 2030 నాటికి సున్నాకు తీసుకురావాలన్న లక్ష్యంగా పెట్టుకుంది. ఏటా సెప్టెంబరు 28న టీకా కనుగొన్న లూయీ పాయిశ్చర్ గుర్తుగా ప్రపంచ రేబిస్ నియంత్రణ దినోత్సవం నిర్వహిస్తారు. రేబిస్ టీకా ప్రాధాన్యంపై అవగాహన పెంచడానికి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోనూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.





లక్ష్యం 2030



న్యూస్‌టుడే, బోధన్ పట్టణం

● దేశంలో 2021లో గంటకు 195 మంది కుక్కకాటుకు గురైతే 2022లో 250, అదే 2023లో 350 మంది బాధితులయ్యారు. ● జాతీయ ఆరోగ్య మిషన్ కుక్కకాటు బాధితులకు వేసే రేబిస్ వ్యాక్సిన్ కోసం రూ. 99.77కోట్ల నిధులు కేటాయించిందట. గతంకంటే బడ్జెట్ పెంచింది. ● ప్రపంచంలో ఏటా 59 వేల మంది రేబిస్, కుక్కకాటుతో సంభవించే మరణాల్లో 36 శాతం మన దేశంలో ఉంటున్నాయట. వాటిలోనూ 40 శాతం 15 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. ● కుక్క కాటు గురైన వ్యక్తికి ఇచ్చే టీకాకు రూ. 5వేల వ్యయమవుతోందట. ● 2023లో దేశ వ్యాప్తంగా 30.43 లక్షల కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ● మనుషుల్లో నమోదైన రేబిస్ కేసులు 99 శాతం కుక్కతోనే వ్యాప్తి చెందింది. ● ప్రతి పదిహేను నిమిషాలకు ప్రపంచంలో ఒకరు రేబిస్‌తో చనిపోతున్నారు. ● రేబిస్ సోకిన తరువాత చికిత్స లేదు. వ్యాధి సోకితే మరణం నమోదవుతుందని చెబుతున్నారు.

భారత్‌లో 2021-23 మధ్య కుక్క కాటు కేసులు రెట్టింపయ్యాయి. దాదాపు 80 శాతం పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి.

ఈ గణాంకాల తీవ్రత ఆధారంగానే రేబిస్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన పెంచుతున్నారు. ప్రజల్లోనూ అవగాహన పెరుగుతోంది. కుక్క, కోతి, పిల్లి కాటేసినా, గోటి గాయాలకూ రేబిస్ టీకా తీసుకుంటున్నారు. పెంపుడు శునకాలకైతే ముందే వేయిస్తున్నారు.

- ● ఉమ్మడి జిల్లాలో తీవ్రంగా సమస్య
- ● ఏటా పెరుగుతున్న కుక్క కాటు బాధితులు
- ● రేబిస్ మరణాలు శూన్యమే ధ్యేయంగా డబ్ల్యూహెచ్‌వో ముందుకు

2030 నాటికి రేబిస్ మరణాలను సున్నాకు తీసుకురావాలన్నది డబ్ల్యూహెచ్‌వో లక్ష్యం. అందుకు 70 శాతం కుక్కలకు టీకాలిస్తే రేబిస్ వ్యాప్తి ఆగిపోతుందన్నది అంచనా. అందుకు అనుగుణంగానే ప్రభుత్వాలు శునకాలకు టీకాలు ఇవ్వాలన్న మార్గదర్శకాలున్నాయి. ఈ ప్రక్రియ స్థానిక సవాళ్లున్నాయి. స్థానిక సంస్థలు వీధి కుక్కలను పట్టుకుని తీసుకొస్తే పశు సంవర్ధక శాఖ సిబ్బంది రేబిస్ టీకా వేస్తారు. వేల సంఖ్యలో ఉన్న కుక్కలను పట్టుకోవాలంటే స్థానిక సంస్థల్లోని సిబ్బంది పారిశుద్ధ్య వ్యవస్థను పక్కన పెట్టాల్సి ఉంటుంది. లేదంటే అదనపు కార్మికులను నియమించుకోవాలి. ఆర్థికంగా భారమైనది కావడంతో అమలు కావడంలేదు.

రెండు గంటలకొకరు...



నిజామాబాద్ జిల్లాలో మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే రెండు గంటలకు ఒకరు సగటున కుక్క కాటుకు గురయ్యారు. 2022లో మాత్రం గంటకు ఒకరు చొప్పున బాధితులున్నారు. 2023, 2024లో మాత్రం రెండు గంటలకు ఒకరు చొప్పున బాధితులయ్యారు.

సంవత్సరం	నిజామాబాద్	కామారెడ్డి
2022	8878	896
2023	4416	756
09/2024	2820	331

ఉమ్మడి జిల్లాలో...

రేబిస్‌తో మరణాలు సంభవించిన దాఖలాలు లేవు. కుక్క కాటు గాయాలతో చనిపోయిన వారున్నారు. ఇందల్వాయికి చెందిన బాలుడు హైదరాబాద్‌లో శునకాల దాడిలో మృత్యు వాత పడ్డాడు. బోధన్ పట్టణంలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. ఇలా అడపాదడపా శునకాల దాడిలో తీవ్ర గాయాలపాలై ప్రాణాలు కోల్పోతున్నారు. వీధి శునకమేది కరిచినా ప్రజలు తక్షణమే ఆస్పత్రికి వెళ్లి టీకా తీసుకోవడం శుభ పరిణామం.

అవగాహన కల్పిస్తున్నాం



రేబిస్ వ్యాధి నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. పశువులను కుక్కలు కాటేసినా రేబిస్ టీకా ఇప్పించాలని సూచిస్తున్నాం. కుక్కల్లో వ్యాధి లక్షణాలు గుర్తించి జాగ్రత్తగా ఉండాలి. ప్రజల్లో అవగాహన పెరిగింది. వ్యాధి రాకుండానే జాగ్రత్తలు తీసుకోవడం మేలు. - డాక్టర్ రోహిత్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ, బోధన్

పచ్చిధాన్యం క్వింటా రూ. 2400

మద్దతు ధర కంటే రూ. 100 అధికం

ఈనాడు, నిజామాబాద్

రాష్ట్రంలోనే వరి కోతలు తొలుత జిల్లాలోని బోధన్ డివిజన్‌లో మొదలవుతాయి. ఈ ప్రాంతంలో నెల రోజుల ముందుగా నారుపోయడంతో నూర్పిడిలు కూడా ముందస్తుగానే జరుగుతాయి. అదీగాక పచ్చిధాన్యాన్నే కోసి కళ్లాల వద్దే మిర్యాలగూడ, హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఈ వానాకాలం సీజన్ కోతలు మొదలయ్యాయి. 42 ఎకరాల్లో తాను సాగుచేసిన సన్నాలను క్వింటా రూ.2400 ధరతో మిర్యాలగూడ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు భవానీపేట గ్రామ రైతు కిరణ్‌బాబు 'ఈనాడు'తో చెప్పారు. మరికొందరికి ఇదే ధర వస్తోందని తెలిపారు. మరో వారం రోజుల్లో ఊపందుకుంటాయని చెబుతున్నారు. కాగా సాధారణ రకానికి ప్రభుత్వ మద్దతు ధర గతేడాది రూ.2,183 ఉండగా.. ఈ సీజన్‌లో రూ.117 పెంచి రూ.2300గా ప్రకటించారు. కానీ డిమాండ్ దృష్ట్యా ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే రూ.100 అదనంగా పెట్టి కొనుగోలుకు ఆసక్తి చూపటం గమనార్హం.

కేంద్రాలు తెరిస్తే మరింత డిమాండ్..

వచ్చే ఏడాది నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేయాలని రాష్ట్ర సర్కారు ఆలోచన చేస్తోంది. ఇందుకు వానాకాలం పంట సేకరణే ఆధారం కానుంది. అదీగాక రూ.500 బోనస్‌పై సానుకూల నిర్ణయం తీసుకున్న క్రమంలో రైతులు కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయానికి ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఈ పరిణామాలు మార్కెట్‌లో సన్నాలకు డిమాండ్ ఏర్పడటానికి కారణంగా చెబుతున్నారు. ఈ



బోధన్ ప్రాంతంలో లారీలో లోడ్ చేస్తున్న కూలీలు

తరహా పోటీ ఏర్పడినప్పటికీ.. ప్రభుత్వ కొనుగోళ్లకు సంబంధించి ఈ సీజన్‌కు మార్గదర్శకాలు ఇంకా విడుదల కాలేదు. వ్యవసాయశాఖ చేపట్టే పంటల వివరాల నమోదు పోర్టల్‌ను పౌరసరఫరాల సంస్థ సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఇంకా జరగలేదు. ఇంతర ప్రాంతాల్లో కోతలు ఈ నెలాఖరున మొదలయ్యే అవకాశం ఉండటంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కూడా అక్టోబరులో ఉండొచ్చని చెబుతున్నారు. కానీ ముందస్తుగా కోతలు జరిగే చోట ధాన్యం నిలువ చేయలేని పరిస్థితి. దీంతో ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరుచుకుంటే.. మరింత డిమాండ్ ఏర్పడి వ్యాపారులు మరికొంత ధర పెంచే అవకాశం ఉందని, ఈ దిశగా చర్యలు చేపట్టాలని బోధన్ ప్రాంత రైతులు విన్నవిస్తున్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, తదితరులు

ఉద్యమానికి ఊపిరి పోశారు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప నేత, తెలంగాణవాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వినాయక్‌నగర్ విగ్రహాల పార్కులో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నాయకులు, కార్పొరేటర్లు, పద్మశాలీ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ నేడు

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఉదయం 10.30 గంటలకు న్యాయసేవా సంస్థ భవన్‌లో ప్రారంభిస్తారని న్యాయసేవా సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లాజడ్జి కుంచాల సునీత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. నిజామాబాద్‌తో పాటు ఆర్మూర్, బోధన్‌లలో ఈ లోక్ అదాలత్ బెంచ్‌లు పని చేస్తాయన్నారు. కక్షిదారులు సకాలంలో వచ్చి తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

సెల్లార్లలో వ్యాపారాలు.. రోడ్లపై వాహనాలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

జిల్లా కేంద్రంలోని కొన్ని వ్యాపార, ఆసుపత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. భవన సముదాయాల్లోని సెల్లార్లను పార్కింగ్‌కు కాకుండా కాంప్లెక్స్ యజమానులు గోదాంలుగా, ఆసుపత్రులు ల్యాబ్‌లు, మందుల దుకాణాలు నిర్వహిస్తుండగా.. మరికొందరు అద్దెకు ఇవ్వడం గమనార్హం. దీంతో నగరంలోని ఆయా భవంతుల వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నా నగరపాలక సంస్థ, టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

నిబంధనలకు తిలోదకాలు..

నగరంలోని రహదారులకు ఇరువైపులా ఆసుపత్రులు, వ్యాపార, వాణిజ్య సంబంధ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టినప్పుడు తప్పనిసరిగా సెల్లార్లు నిర్మించుకోవాలనే నిబంధన ఉంది. అందులో ఇతర నిర్మాణాలు చేపట్టరాదు. పనులపై వచ్చేవారు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా సంబంధిత భవన సెల్లార్లలోనే వాహనాలను పార్కింగ్ చేయాలి. కానీ నగరంలో ఖలీల్‌వాడి, గాంధీచౌక్, బస్టాండ్ రోడ్డు, ప్రగతినగర్, వినాయక్‌నగర్, పూసలగల్లీ, హైదరాబాద్ రోడ్డు పాత భవనాలతో పాటు కొత్తగా నిర్మిస్తున్న ఐదంతస్తుల సమూదాయాల్లోనూ కొన్నింటికి సెల్లార్లు లేని దుస్థితి. కొన్నింట్లో ఉన్నా వ్యాపారాలు ఇతర వాటికి వినియోగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ముఖ్యంగా నగరంలో సోమ, శనివారాల్లో రద్దీ ఎక్కువ ఉండి పనులపై వచ్చేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అనుకోకుండా అగ్ని ప్రమాదాల వంటివి సంభవిస్తే ఆస్తితో పాటు భారీగా ప్రాణ నష్టం వాటిల్లే అవకాశముంది. అలాంటివి జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం అత్యావశ్యకం.

ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం..

కొంతమంది యజమానులు తమ భవనాల్లోని సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగిస్తూ.. తమ వాహనాలను రోడ్లపై నిలుపుతున్నారు. వాటిని ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీసి జరిమానాలు వేస్తున్నారు. దీంతో కొంతమంది ఫొటోలు ఎందుకు తీస్తున్నారని వారితో వాగ్వాదానికి దిగుతుండడం కొసమెరుపు. ఇప్పటికైనా నగరంలో పెరుగుతున్న వాహనాలు, జనాభా రద్దీని దృష్టిలో పెట్టుకొని అధికారులు చర్యలు తీసుకోవాలి. సెల్లార్లలోని వ్యాపారాలను తొలగించి, ఐదంతస్తుల భవనాలకు వీటిని నిర్మించేలా చూడాలి.



సెల్లార్‌లో ల్యాబ్ నిర్వహిస్తున్న ఆసుపత్రి యాజమాన్యం



నగరంలోని ఓ భవంతి ఎదుట రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

కఠిన చర్యలు తీసుకుంటాం

అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలు భవన యజమానులకు నోటీసులు జారీ చేశాం. ఎన్నికలు రావడంతో ప్రక్రియ ఆగింది. వారం రోజుల్లో నోటీసులు ఇచ్చేందుకు ప్రస్తుతం ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలో సెల్లార్లలో చేస్తున్న వ్యాపారాలకు అడ్డుకట్ట వేసి పార్కింగ్ ఉంటేనే వాటికి అనుమతిస్తాం. ఇప్పటికైనా నోటీసులు రాకముందే సెల్లార్ల నుంచి వ్యాపారాలు తొలగించాలి. లేదంటే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం. - మకరందు, నగరపాలక సంస్థ కమిషనర్

ఇందూరులో సినీ తారల సందడి



సినీ హీరో రామ్ పోతినేని, హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ నగరంలోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి శుక్రవారం హాజరై సందడి చేశారు. హాలో.. నిజామాబాద్ అంటూ అభిమానులతో ప్రేమగా ముచ్చటించారు. స్టెప్పులు వేసి వారిలో జోష్ నింపారు. సినీ తారలను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలొచ్చారు. సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. దీంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. - ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, ఖలీల్‌వాడి

పరిహారం నాలుగు రెట్లు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

జిల్లాలో దెబ్బతిన్న 230 ఇళ్లకు రూ.37 లక్షలు చెల్లింపు

విపత్తు పరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భారీ వర్షాలకు కూలిన ఇళ్లకు నష్టపరిహారం నాలుగు రెట్లు చేశారు. ఇటీవల వర్షాలకు నష్టపోయిన వారికీ వర్తింపజేశారు. ఇది వరకు బాధితులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఎప్పటికప్పుడు వివరాలు సేకరించి కలెక్టరేట్‌లోని ఖజానా శాఖకు పంపిస్తే వెంటనే పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని 530 పంచాయతీల పరిధిలో 230 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. లబ్ధిదారుడి ఆధార్, బ్యాంకు ఖాతా, పంచనామా నివేదిక సేకరించి ట్రెజరీకి నివేదించారు. ఇంటికి రూ.16,500 చొప్పున రూ.37.95 లక్షలు చెల్లించారు. పరిహారం నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో జమ చేశారు. గతంలో ఇల్లు, గుడిసె పాక్షింగా దెబ్బతింటే రూ.3,200 నుంచి రూ.4 వేలు మాత్రమే వచ్చేవి. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంచనామా చేసేవారు. పరిహారం కొందరికే అందేది. సరైన పత్రాలు లేవని, అంతగా దెబ్బతినలేదనే సాకు చూపి దరఖాస్తులు తిరస్కరించేవారు. ఈసారి తహసీల్దార్లు ఎప్పటికప్పుడు నివేదిక సిద్ధం చేసి కలెక్టరేట్‌కు పంపించారు. చెల్లింపుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకున్నారు.



నిజామాబాద్‌లో కూలిన ఇల్లు

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని కొత్త అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు నిర్వహించగా.. విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పేరు నిలబెట్టాలన్నారు. ముగింపు కార్యక్రమాల్లో డీఐఈవో రవికుమార్, కాకతీయ విద్యాసంస్థల ప్రిన్సిపల్ రణధీర్, న్యాయనిర్ణేతలుగా సిర్ప లింగం, ఉమాబాల, పాయల్, భుజంగం, నరేశ్, శ్వేతారెడ్డి, సాయిలవోల, వ్యాఖ్యాతగా సాయిబాబు వ్యవహరించారు. ఎన్‌వైకే అధికారిణి శైలిబెల్లాల్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో డీవైఎస్‌వో ముత్తన్న, ఎన్‌వైకే యువజన అధికారిణి శైలిబెల్లాల్, న్యాయనిర్ణేతలు

మూడు పంటలకు బోనస్ ఇవ్వాలి

వేల్పూర్(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: మొక్కజొన్న, సోయాబీన్, వరి పంటలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రం నిర్ణయించిన ధర కంటే క్వింటాలుకు రూ.500 అదనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో చెప్పారని, ఇదే విషయాన్ని ఎన్నికల ప్రణాళికలోనూ పెట్టారని పేర్కొన్నారు. మొక్కజొన్న మార్కెట్‌లోకి వచ్చిందని కేంద్రం ధర రూ.2225కు అదనంగా రూ 500 కలుపుకొని రూ.2725కు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. సోయాబీన్ కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.5392 మద్దతు ధరతో కొనాలని, దొడ్డు వడ్లకు సైతం బోనస్ ఇవ్వాలని రైతు పక్షాన కోరుతున్నామన్నారు. రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని, రైతు భరోసా అందించాలన్నారు. అర్జీల పేరుతో రుణమాఫీని కాలయాపన చేయడం తగదన్నారు. భారాస మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

తాలు సంగతి తేల్చండి!

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే సమస్యలకు తమను బాధ్యులు చేయొద్దని సొసైటీ ఛైర్మన్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐడీసీఎంఎస్ మహాజన సభ ఇందూరులోని ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ తారాచంద్‌నాయక్ అధ్యక్షత జరుగగా.. డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు సన్న రకాల కొనుగోళ్లలో ఇబ్బందులు తప్పవని చెప్పారు. సన్నాలను నిర్ధారించే బాధ్యత వ్యవసాయశాఖనే తీసుకోవాలని, దోమపోటు వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో తాలు గింజ అధికంగా వచ్చే అవకాశం ఉందని వివరించారు. రైస్‌మిల్లర్లు తరుగు తీసే వ్యవహారంపై ముందే ఏదో ఒకటి తేల్చాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఏఏ రకాల సన్నాలను కొంటారనే దానిపై రైతుల్లో అనుమానాలు ఉన్నాయన్నారు. వాటి విషయంలో ఛైర్మన్లకు చెడ్డపేరు రాకుండా చూడాలని కోరారు. రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపుపై చర్చించారు. రైతుల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా చూడాలని విన్నవించారు. డీసీవో శ్రీనివాస్‌రావు, వైస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు తదితరులున్నారు



మాట్లాడుతున్న ఛైర్మన్ తారాచంద్ నాయక్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, తదితరులు

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి'

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ సర్కారుతోనే సాధ్యమని, బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ మండలం డివిజన్-1 ఖానాపూర్‌లో జన్నేపల్లి ఎక్స్ రోడ్డు వరకు రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డుతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. పార్టీలకు అతీతంగా పేదలకు రెండు పడకల ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు గ్రామం బయట నుంచి బైపాస్ రోడ్డు మంజూరు చేయిస్తే గత ఎమ్మెల్యే అడ్డుకున్నారని ఆరోపించారు. నగర మేయర్ నీతూ కిరణ్, మార్కెట్ యార్డు ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి తదితరులున్నారు.

విద్యుత్తు ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్

విద్యుత్తు శాఖ ఉద్యోగుల బదిలీలకు ఉన్నతాధికారులు ఎట్టకేలకు పచ్చజెండా ఊపారు. ఇందుకు సంబంధించి టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం మార్గదర్శకాలు జారీ చేశారు. అక్టోబరు 7వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రెండేళ్ల పాటు సర్వీసు పూర్తయిన వారిలో 50 శాతం చేపట్టాలని పేర్కొన్నారు.

మొదటి సారి వెబ్ ఆప్షన్

పైస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు ఈసారి వెబ్ ఆప్షన్‌ను ప్రవేశపెట్టారు. డీఈ, ఏఈ, సబ్ ఇంజినీర్, ఎస్ఏవో, జేఏవో, ఏవో, ఏఏవో, పీవో క్యాడర్ ఉద్యోగులు ఉద్యోగ బదిలీ పోర్టల్ https:options.tgnpdcl.com:5757/NPEMP లో లాగిన్ కావాలి. అందులోని ఖాళీ పోస్టుల్లో ఎక్కడికి వెళ్తారో సూచించాలి. ఈ ప్రక్రియ 28 నుంచి ప్రారంభించి అక్టోబరు 4వ తేదీ వరకు పూర్తి చేయాలని పేర్కొన్నారు. మిగిలిన క్షేత్రస్థాయి సిబ్బందికి సర్కిల్ స్థాయిలో డీఈలు కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు నిర్వహిస్తారు.

గడువులోపు పూర్తి చేస్తాం

సీఎండీ ఉత్తర్వుల ప్రకారం గడువులోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తాం. ఎలాంటి పైరవీలకు తావులేకుండా చూస్తాం. పారదర్శకంగా చేపడుతాం. - రవీందర్, ఎస్ఈ, నిజామాబాద్

వ్యర్థాలతో అనర్థం

☛ మున్సిపాలిటీల్లో స్పందిస్తేనే స్వచ్ఛత
☛ యంత్రాల వినియోగంలో అలసత్వం

పరిశీలన

నగర, పురపాలికల్లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంటుతో పాటు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేరు చేసే యంత్రాలు ఏర్పాటుచేశారు. రూ.లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసినా లక్ష్యం నెరవేరడం లేదు. వీటిని సద్వినియోగం చేసుకోవడంలో యంత్రాంగం అలసత్వం ప్రదర్శిస్తోంది. పురపాలికల్లో పరిస్థితిపై కథనం.

● జనాభా ★ గృహాలు ◆◆ సెప్టిక్ ట్యాంకులు ☛ సమస్య

సమస్యకు శాశ్వత పరిష్కారం

● 3.90 లక్షలు ★ 84,750 ◆◆ 65 వేలు

☛ నిజామాబాద్ నగరంలో సెప్టిక్ ట్యాంకు నిండితే మలం సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.



అక్కడ శుద్ధీకరణ ప్లాంట్‌ను 2023లో ఏర్పాటు చేశారు. దీనికి నిత్యం 230 నుంచి 250 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి. ఇక్కడ యంత్రంలో చెత్త వేస్తే ప్లాస్టిక్, కంపోస్టును, మట్టిరాళ్లను వేరుచేస్తోంది. నిత్యం సుమారు 200 టన్నుల చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు పంపిస్తున్నామని, ప్రక్రియ సాగుతోందని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు.

- న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

విద్యుత్తు సరఫరా లేదు

● 90వేలకి పైగా ★ 22188 ◆◆ 22188

☛ ఆర్మూర్‌లో శుద్ధీకరణ ప్లాంటు పనులు 2021లో ప్రారంభించి 2024లో పూర్తి చేశారు. విద్యుత్తు సరఫరా లేక ప్రారంభానికి నోచుకోలేదు. ప్రైవేటు వ్యక్తులు మలం సేకరించి నిర్మానుష్య ప్రాంతాల్లో గుంతలు తీసి పడేస్తున్నారు. ప్లాంటుకు విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని పుర కమిషనర్ రాజు తెలిపారు.

- న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

లక్ష్యం అధిగమించడంలో నిర్లక్ష్యం

● 100436 ★ 26,346 ◆◆ 16,150

☛ కామారెడ్డి శివారులోని సిరిసిల్లరోడ్డు, పాతరాజంపేట, క్యాసంపల్లి వద్ద వ్యర్థాలు పారేస్తున్నారు. 2022లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కోసం ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనికి నెలకు 5 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న పది వాహనాలు మాత్రమే వస్తున్నాయి. గతంలో రెండుసార్లు మల సేకరణ చేసే వాహన యజమానులకు పురపాలకశాఖ నోటీసులిచ్చినా పరిస్థితిలో మార్పులేదు. అవసరం ఉన్న



వారు మాత్రమే వ్యర్థాల సేకరణ వాహనదారులను సంప్రదిస్తున్నారని, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చర్యలు చేపడతామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ అన్నారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

నిర్మించి అప్పగించలేదు

● 86,000 ★ 21,000 ◆◆ 15,120

☛ బోధన్ పట్టణ శివారుల్లో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను పడేస్తున్నారు. పట్టణంలోని డంపింగ్‌యార్డులో మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంటు 2021లో మంజూరు చేశారు. సంబంధిత ఏజెన్సీ నిర్మించినా ఇంకా అందుబాటులోకి రాలేదు. దీని ఇంకా తమకు అప్పగించలేదని పుర కమిషనర్ వెంకటనారాయణ అన్నారు.

- న్యూస్‌టుడే, బోధన్ పట్టణం



బోధన్‌లో నిర్మించి వదిలేసిన మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంటు

కేంద్రం ఊసే లేదు

● 22,000 ★ 5,342 ◆◆ 1011

☛ ఎల్లారెడ్డిలో ఇప్పటివరకు మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు కాలేదు. చెత్త వేరు చేసే యంత్రాలు లేవు. సేకరించిన 20 మెట్రిక్ టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అందులో 5 మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయి. యంత్రాలు మంజూరైతే స్వచ్ఛ సేవలు అందిస్తామని పుర అధికారులు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

రోడ్డు వెంటే..



● 25,600 ★ 4,700 ◆◆ 3,783

☛ భీమ్‌గల్ పురపాలికలో మానవ వ్యర్థాల శుద్ధీకరణ జరగడం లేదు. ప్రైవేటు వాహనాల్లో సేకరించి రోడ్డు, గుట్టల వెంబడి, బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. 'గతంలో తడి, పొడి చెత్తను వేరు చేసే యంత్రం మంజూరైనా.. అది మధ్యలో ఆగి పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం చెత్తను అడ్డగుట్ట వద్ద ఉన్న డంపింగ్‌యార్డు ప్రతిపాదిత స్థలానికి తరలిస్తున్నాం.' అని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ అన్నారు.

- న్యూస్‌టుడే, భీమ్‌గల్

చదును చేసి.. వదిలేసి

● 30,326 ★ 9532 ◆◆ 9024

☛ బాన్సువాడ శివారులో వ్యర్థాలు పారేస్తున్నారు. శుద్ధీకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తామంటూ నాలుగేళ్లుగా చెబుతున్నా అడుగు ముందుకు పడడం లేదు. డంపింగ్‌యార్డు స్థలంలో మొరం వేసి చదును చేశారు. నియంత్రణను ప్రైవేటు చేశారు. అయినా ఫలితం లేదు. సంబంధిత సంస్థ ప్రతినిధులు రాగానే కేంద్రం పనులు మొదలు పెడతామని ఏఈ శ్రీకాంత్, పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు అన్నారు. త్వరలోనే ఎఫ్‌ఎస్‌టీపీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం



నిర్మించాల్సిన ప్రదేశంలో మొరం వేసి వదిలేశారిలా....



జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ అర్వింద్, చిత్రంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ నీతూకిరణ్ తదితరులు

వస్త్ర దుకాణం ప్రారంభం

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: నగరంలోని హైదరాబాద్ రోడ్డు(పులాంగ్‌చౌరస్తా)లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను శుక్రవారం ఎంపీ అర్వింద్ ప్రారంభించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూకిరణ్‌తో కలిసి జ్యోతి వెలిగించారు. ఈ కార్యక్రమానికి సినీ హీరో రామ్ పోతినేని, హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ హాజరై సందడి చేశారు. షాపింగ్‌లో తిరిగి వస్త్రాలు తిలకించారు. నూతన మోడళ్లను అందుబాటులో ఉంచినందుకు షోరూం నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. పిల్లలు, యువత, మహిళలు, పురుషులకు సంబంధించిన అన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉంచినట్లు సీఎంఆర్ ఛైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్ మోహన్ బాలాజీ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, భాజపా నాయకులు పల్లె గంగారెడ్డి, బస్వాలక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండారం గువ్వలు.. సాహితీ మల్లెలు

● రచనల్లో సర్కారు బడి పిల్లల ప్రతిభ

న్యూస్‌టుడే, నిజామాబాద్ గ్రామీణం

చిరుప్రాయాలు అద్భుతాలు చేస్తున్నాయి. తెలుగు భాషపై పట్టుసాధించి మంచి కవితలు రాస్తున్నాయి. పద్యాలు అల్లుతున్నాయి. పద్య శతకాలు, కవితా సంపుటులు ఆవిష్కరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాయి. అవార్డులు అందుకుంటున్నాయి. గ్రామీణ మండలం గుండారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు ఉపాధ్యాయుడు, కవి కాసర్ల నరేష్‌రావు శిక్షణలో రచనల్లో ప్రతిభ చాటుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మనోగతంపై 'న్యూస్‌టుడే' కథనం.

గురువు మార్గదర్శనంతో..

- ఆర్.లాస్య, పదో తరగతి

తెలుగు భాష, సాహిత్యం అంటే చాలా ఇష్టం. ఇప్పటివరకు 60 కవితలు, 10 కథలు రాశా. జిల్లాస్థాయి కథల పోటీల్లో విజేతగా నిలిచా. అంతర్జాతీయ స్థాయి కవితల పోటీల్లో గెలుపొందా. తెలుగు పండితుడు నరేష్‌రావు మార్గదర్శనంలో రాణిస్తున్నా.

ఆనందంగా ఉంది..

- ఏ.కృష్ణవేణి, పదో తరగతి

నేను ఇప్పటివరకు 50 కవితలు రాశా. సైన్సు ఫిక్షన్ కథలు 10 ఉన్నాయి. జిల్లా నుంచి అంతర్జాతీయస్థాయి వరకు బహుమతులు గెలుచుకోవడం ఆనందంగా ఉంది.

పుస్తకం తేవడమే లక్ష్యం

- అశ్విని, 8వ తరగతి

వందకు పైగా పద్యాలు ధారణ చేశా. ఆరో తరగతి నుంచి ఇప్పటి వరకు 40 కవితలు రాశా. కవితా సంపుటి తీసుకురావడమే నా లక్ష్యం.

అవార్డుల పంట..

● 2018లో 'గుండారం గువ్వలు' కవితా సంకలనాన్ని తీసుకొచ్చారు. ● ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న విద్యార్థి పూజశ్రీ జిల్లాలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ● జిల్లాస్థాయి బాల కవి సమ్మేళనంలో 30 మంది పాల్గొని పాలనాధికారి నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ● సైన్సు ఫిక్షన్ బాలల జాతీయస్థాయి కథారచన పోటీల్లో ప్రథమ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. ● అంతర్జాతీయంగా ప్రచురితమయ్యే బాలల మాసపత్రిక 'గడుగ్గాయి' నిర్వహించిన కవితా రచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలతోపాటు నాలుగు బహుమతులు అందుకున్నారు.

● టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన రామాయణ, మహాభారత కథల పోటీల్లో ప్రథమ, తృతీయంతో పాటు ఆరు బహుమతులను సొంతం చేసుకున్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

మరిన్ని రాస్తా..

- శ్రుతి రెడ్డి, 9వ తరగతి

ఏడో తరగతి నుంచి కథలు రాస్తున్నా. గడుగ్గాయి మాసపత్రిక అంతర్జాతీయ కవితా పోటీల్లో, ఓటు విలువ పోటీల్లో జిల్లాస్థాయిలోనూ విజేతగా నిలిచా. 30 కవితలు రాశా. మరిన్ని రాస్తా.

కాసర్ల కృషి మరువలేనిది

- అమర్‌నాథ్, గుండారం జడ్పీహెచ్‌ఎస్, ప్రధానోపాధ్యాయుడు



ఇది వరకు ఇక్కడ పనిచేసిన తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేష్‌రావు విద్యార్థుల ప్రతిభను వెలికి తీశారు. ఆయన కృషితోనే విజయాలు సాధ్యమయ్యాయి. ఆయన నేర్పిన స్ఫూర్తిని కొనసాగిస్తున్నాం.

నిర్వహణ లేక.. నీటికి అడ్డుగా..

ఈ చిత్రంలో కనిపిస్తుంది జుక్కల్, బిచ్కుంద మండలాల్లోని వందల ఎకరాలకు నీరందించే కౌలాస్ ప్రాజెక్టు కాల్వ. ఇందులో గడ్డి, తుంగ పేరుకుపోయి చివరి ఆయకట్టు వరకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. కాల్వ అక్కడక్కడ దెబ్బతినడంతో నీరు వృథాగా పోతోందని, పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందన కొరవడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. కాల్వలోని తుంగ, గడ్డితోపాటు పేరుకుపోయిన పూడిక తొలగించి మరమ్మతులు చేపట్టాలని, చివరి ఆయకట్టు వరకు నీరందించాలని కోరుతున్నారు.

– ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, జుక్కల్



రిజిస్ట్రార్ అభినందన

తెవివి క్యాంపస్, (డిచ్‌పల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: జంతుజాల సంరక్షణ విధాన రూపకల్పనపై భిక్కనూరు క్యాంపస్‌లో 26న నిర్వహించిన జాతీయ సైన్స్ డే వేడుకలను విజయవంతం చేయడంలో కృషి చేసిన సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి డా.ప్రసన్నశీలను రిజిస్ట్రార్ యాదగిరి శుక్రవారం అభినందించారు. క్విజ్ విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. నిర్వహణ కమిటీ బృందం సుధాకర్‌గౌడ్, సునీల్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీకాంత్‌లనూ అభినందించారు.



ప్రసన్నను అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెవివి భూములు కాపాడండి.. తెవివి క్యాంపస్, (డిచ్‌పల్లి గ్రామీణం): తెవివికి చెందిన భూములను కాపాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. తెవివిలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో భూములు కబ్జాకు గురైనప్పుడు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారన్నారు.

ప్రభుత్వ పర్యవేక్షణలోనే వర్సిటీ స్థలం.. తెవివి క్యాంపస్, (డిచ్‌పల్లి గ్రామీణం): ప్రభుత్వ పర్యవేక్షణలోనే తెవివి భూమి ఉంటుందని రిజిస్ట్రార్ యాదగిరి ప్రకటనలో తెలిపారు. 578.02 ఎకరాలకు హద్దులు నిర్ణయించి పంచనామా చేసి అప్పటి అధికారులకు తెవివి వైస్ ఛాన్స్‌లర్ అప్పజెప్పారన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఇటీవల సర్వే పూర్తిచేశారని, దస్త్రావేజులను జిల్లా రెవెన్యూ కార్యాలయంలో భద్రపరుస్తారని తెలిపారు. స్థలానికి సంబంధించిన న్యాయ సంబంధమైన అంశాలు రెవెన్యూ విభాగ పర్యవేక్షణలోనే ఉంటాయన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: చదువుతో కలిగే ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని యువ హీరో ఆకాశ్‌పూరి జగన్నాథ్ అన్నారు. నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో డి.శ్రీనివాస్ జ్ఞాపకార్థం నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, చక్కగా చదువుకోవాలన్నారు. విద్యార్థుల కోరిక మేరకు ఓ డైలాగ్ వినిపించి అలరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. అంతకుముందు సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో డి.శ్రీనివాస్ జయంతి సందర్భంగా క్రీడాకారులతో కలిసి కేక్ కోశారు. డీఎస్ జిల్లా అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. క్రీడాపోటీలు విజయవంతంగా ముగియడానికి పీడీలు సాయిలు, విద్యాసాగర్‌రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేటు పీడీ, పీఈటీలు కీలక పాత్ర పోషించారని తెలిపారు. సభ్యులు ధర్మపురి సురేందర్, గౌతమ్, పుప్పాల శోభ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న హీరో ఆకాశ్ పూరి, సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్

తైక్వాండో ఎంపికలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 30న, వచ్చే నెల 1న అండర్-14, 17 బాలబాలికలకు తైక్వాండో ఎంపికలు నిర్వహిస్తున్నామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14 బాలబాలికలకు 30న ఎంపికలుంటాయని, 1 జనవరి 2011 తర్వాత పుట్టినవారు అర్హులని, అండర్-17 విభాగంలో అక్టోబరు 1న ఎంపికలుంటాయని, 1 జనవరి 2008 తర్వాత పుట్టినవారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు తైక్వాండో రక్షణ సామగ్రిని తీసుకురావాలన్నారు. వివరాలకు 70970 47036 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

అక్టోబరు 1న ఖోఖో జిల్లాస్థాయి పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం: నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో వచ్చే నెల 1న ఉదయం 10 గంటలకు అండర్-14 బాలబాలికలకు జిల్లాస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోనల్ బృందాలు మాత్రమే పోటీలకు అర్హులని పేర్కొన్నారు. 1 జనవరి 2011 రోజున లేదా ఆ తర్వాత పుట్టినవారు అర్హులన్నారు. క్రీడాకారులు తమ పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికేట్ తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 93472 16426 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

గోదావరిలో మహిళ గల్లంతు

బాసర(ముథోల్), డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గోదావరి నదిలో పుణ్యస్నానానికి కుటుంబంతో కలిసి వచ్చిన ఓ మహిళ గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన జయ(45) కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆమె భర్త ఏడాది కిందట అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి పుట్టింటి గ్రామమైన ధర్మారంలో ఉంటున్నారు. మూడు నెలల కిందట జయ తల్లి కన్నుమూశారు. దసరా పండుగ నేపథ్యంలో గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించాలని వేద పండితులు చెప్పడంతో తన ఇద్దరు కుమార్తెలు, తమ్ముడు, మరదలు, తండ్రి తదితరులతో ఉదయం బాసరకు చేరుకున్నారు. గోదావరిలో పుణ్యస్నానానికి మరదలు కృష్ణవేణి, జయ వెళ్లారు. ఎగువన వర్షాలు కురవడంతో గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో జయ ప్రవాహంలో కొట్టుకుపోయారు. కృష్ణవేణిని భక్తులు, గజ ఈతగాళ్లు కాపాడారు. బాసర ఎస్సై గణేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గల్లంతైన మహిళ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జయ

కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీరామసాగర్ : శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు మిగులు జలాల విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి చేరుతున్న వరద శుక్రవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టిందని ప్రాజెక్టు ఏఈఈ కొత్త రవి తెలిపారు. ఉదయం ఆరు గంటలకు 90,470 క్యూసెక్కులు రాగా, 20 గేట్ల ద్వారా 62,480 క్యూసెక్కులు నదిలోకి విడుదల చేశారు. సాయంత్రానికి వరద 40,586 క్యూసెక్కులకు తగ్గడంతో నాలుగ గేట్లు మూసి.. 16 గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో 1091 అడుగులు, 80.501 టీఎంసీల నిల్వ ఉంది. వరద కాల్వ ద్వారా 19000, కాకతీయ కాల్వకు 6800, ఎస్కేప్ గేట్ల నుంచి 1200, లక్ష్మి కాల్వకు 150, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల వదులుతున్నారు.

కరీంనగర్ రైలు రద్దు కొనసాగింపు

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: రైళ్ల రద్దు పరంపర కొనసాగుతోంది. బోధన్-కరీంనగర్ రైలును మరో నెల రద్దు చేస్తూ రైల్వే శాఖ సమాచారమిచ్చినట్లు స్టేషన్ మాస్టర్ రాము తెలిపారు. తాజా ఉత్తర్వులో అక్టోబరు 9 నుంచి నవంబరు 1 వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

ఎంపీ అర్వింద్‌కు వినతిపత్రం

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్‌ఆర్‌యూ) జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంత్ శుక్రవారం ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వినతిపత్రం ఇచ్చారు. రిప్రజెంటేటివ్‌లకు చట్టబద్ధమైన పని నియామకాలు, 2017లో ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీని అమలు చేసి కార్మికులను ఉద్యోగం నుంచి టర్మినేట్, దూర ప్రాంతాలకు బదిలీ చేయడం ఆపాలని కోరారు. శ్రీనివాస్, సంపత్, సంతోష్, గంగామోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



తాగునీటి ఎద్దడి తీర్చాలని రాస్తారోకో

కోటగిరి: తాగునీటి ఎద్దడి తీర్చాలని ఎత్త సెఫూర్ క్యాంపు ఎస్సీ కాలనీవాసులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో వ్యవసాయ బోరుబావుల నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చందర్ కాలనీని సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటిని ట్యాంకుల ఎక్కించి సరఫరా చేయించారు.



ఈనాడు సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్-1: దేవర పార్ట్-I : 9.10, 12.20, 3.40, 7.00, 10.20(రాత్రి) స్క్రీన్-2: దేవర పార్ట్-I 1.30, 7.30, 10.40(రాత్రి)
స్క్రీన్-3: సత్యం సుందరం: 12.35, 4.00, 7.20, 10.40(రాత్రి)
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)
స్క్రీన్-1: దేవర పార్ట్-I : 11.15, 2.50, 6.25, 10.00 (రాత్రి)
స్క్రీన్-3: మత్తు వదలరా-2 12.00, 3.00, 6.10, 9.00 (రాత్రి)
స్క్రీన్-4: సత్యం సుందరం: 11.00, 2.40, 6.20, 10.00(రాత్రి) దేవి (ఎస్వీసీ): సత్యం సుందరం 10.50, 2.15, 6.00, 9.30(రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): దేవర పార్ట్-I (హిందీ) 11.00, 2.30, 6.00, 9.30(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 11.00, 2.15, 6.00, 9.15(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 10.50, 2.20, 6.00, 9.40(రాత్రి)

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం


కలెక్టరేట్‌లో.. అదనపు పాలనాధికారి కిరణ్‌కుమార్


కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..


సీపీ కార్యాలయంలో.. అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావు, సిబ్బంది


నగరంలో భారాస ఆధ్వర్యంలో..

కొండా లక్ష్మణ్ చిరస్మరణీయుడు

కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆశయసాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే యంత్రాంగం


సిరికొండలో..


రుద్రూర్‌లో..


మోపాల్‌లో..


డిచ్‌పల్లి గ్రామీణం: ఆదర్శ పాఠశాలలో..


జక్రాన్‌పల్లిలో బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ


నివాళులర్పిస్తున్న జిల్లా పద్మశాలి ప్రతినిధులు


నవీపేటలో..


బోధన్‌లో..

ఇందల్‌వాయి సొసైటీ మహాజన సభ రసాభాస

● సీఈవో అవినీతికి పాల్పడినట్లు రైతుల ఆరోపణ


నిరసన తెలుపుతున్న రైతులు

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: రుణాల మంజూరు, నిధుల విషయంలో ఇందల్‌వాయి సొసైటీ సీఈవో రతన్ అవినీతికి పాల్పడినట్లు పలువురు రైతులు ఆరోపించారు. కో-ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ సెక్షన్ 51 ప్రకారం వెంటనే ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామాలయంలో సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మహాజన సభ రసాభాసగా సాగింది. సొసైటీ డబ్బులు రూ.7.20 లక్షలు సీఈవో ఇష్టానికి వాడుకున్నారని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. రుణమాఫీ సమస్యను ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ మారుతి, డీసీసీబీ డైరెక్టర్ ఆనంద్, డైరెక్టర్ మల్లారెడ్డి, దాసు, గంగాధర్, గంగారెడ్డి, రాజు, రాంరెడ్డి, గంగామణి, బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని తీర్మానం

నవీపేట, న్యూస్‌టుడే: నాగేపూర్ సహకార సంఘం అధ్యక్షుడు శైలేశ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. రుణమాఫీ పొందని రైతులకు త్వరగా చేయాలని, ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని సభ్యులు తీర్మానం చేశారు. కార్యదర్శి రమేశ్ వార్షిక నివేదిక చదివి వినిపించారు.

గోదాం ఏర్పాటుకు..

రెంజల్(ఎడపల్లి): దూపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను శుక్రవారం ఛైర్మన్ భూమారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ పరిధిలో గోదాముల నిర్మాణం, అర్హులైన సభ్యులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని తీర్మానించారు. సొసైటీ కార్యదర్శి జీవన్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బోధన్ గ్రామీణం: బోధన్ మండలం కల్దుర్కి ప్రాథమిక సహకార సంఘ సర్వసభ్య సమావేశం శుక్రవారం జి.ఛైర్మన్ శరత్ అధ్యక్షతన నిర్వహించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, సోయాబీన్, ధాన్యం కొనుగోలు చేసి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని తీర్మానం చేశారు. వైస్ ఛైర్మన్ రమేష్‌పటేల్, కార్యదర్శి శ్రీనివాసాచారి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ధర్పల్లి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని సొసైటీ ఛైర్మన్ మల్కాడ్ అర్జున్ తెలిపారు. ధర్పల్లి వ్యవసాయ సహకార సంఘంలో ఛైర్మన్ అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. వైస్ ఛైర్మన్ గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

పూడిక తొలగించారు



బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ మండలం సిద్దాపూర్‌లో మురుగుకాల్వలో చెత్తాచెదారం నిండిందని 'ఈనాడు'.. 'మేమున్నాం, మీకు తోడుగా'కు సమస్య ప్రస్తుతమైంది. పంచాయతీ సిబ్బంది శుక్రవారం స్పందించి వ్యర్థాలు తొలగించి దోమల మందు పిచికారీ చేశారు.

లీకేజీ అరికట్టారు



బోధన్ పట్టణం: శక్కర్‌నగర్‌చౌరస్తాలో పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు చెప్పారు. సమస్యను పుర ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు.



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో మిషన్ భగీరథ వాల్వు గుంత ప్రమాదకరంగా ఉండటంతో సమస్యను ఏఈ అన్వేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పైకప్పును ఏర్పాటు చేయించారు.

సమస్య: నగరంలోని చంద్రనగర్ ప్రాంతంలో ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచిపోవడంతో దోమల సమస్య తీవ్రమవుతోంది. - నరేష్, చంద్రనగర్

సమాధానం: దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. - సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, జోన్-2, నగరపాలక సంస్థ

సమస్య: నిజామాబాద్ స్వాగత ద్వారం బోర్గాం(పి) కూడలి వంతెనల వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. అక్కడ వీధి దీపాలు కూడా లేవు. - సుదర్శన్, పాల వ్యాపారి, మాధవనగర్

సమాధానం: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం - రవి, మున్సిపల్ సిబ్బంది

సమస్య: కాలూరు శివారులో ధాన్యం మిల్లుల నుంచి మురుగు రోడ్డుపైకి వదులుతున్నారు. భరత్, కాలూరు

సమాధానం: సంబంధిత మిల్లు యజమానులకు నోటీసులు ఇస్తాం -ప్రశాంత్, శానిటరీ, ఇన్‌స్పెక్టర్

సమస్య: న్యాల్‌కల్ రోడ్డులో రోటరీనగర్ రోడ్-4 వద్ద భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు బయటకు వచ్చి ఖాళీ ప్లాట్లలో చేరుతోంది. -సుమాన్

సమాధానం: మురుగు తీసే ప్రత్యేక వాహనం పాడైంది. యంత్రం బాగు కాగానే వెంటనే శుభ్రం చేస్తాం.
- మహిపాల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

సమస్య: మాధవనగర్ రైల్వేగేటు సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారింది.
- శ్రీనివాస్, వినాయక్‌నగర్

సమాధానం: ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చూస్తాం.
- సునీల్,పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

– న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్, నగరం, గ్రామీణం, మోపాల్

కుటుంబ జీవనానికి ప్రత్యేక స్థానం

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: భారతీయ జీవన విధానంలో కుటుంబ జీవనానికి ప్రత్యేక స్థానం ఉందని, పిల్లలను సంస్కరించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని రాష్ట్ర సేవికా సమితి జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ శుభ అన్నారు. భారత మాత భజన పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రం శివాజీనగర్ మున్నూరుకాపు కళ్యాణ మండపంలో గోలేహనుమాన్ ప్రఖండ భజన మండలి సమ్మేళనాన్ని నిర్వహించారు. అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని నిర్వాహకులను అభినందించారు. వ్యవస్థాపకులు సుబ్బారావు, మేఘా సుబేదార్, గంగాకిషన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర సేవికా సమితి జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ శుభ

స్పందించి.. పొదలు తొలగించి

ఈనాడు కథనానికి స్పందన

నవీపేట, న్యూస్‌టుడే: రాంపూర్ శివారులో రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగిన పొదలు, చెట్ల కొమ్మలను అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది శుక్రవారం తొలగించారు. 'ప్రయాణం.. ప్రమాదం' అనే శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆర్.అండ్.బి. శాఖ ఏఈ రమీద్ స్పందించి సిబ్బందితో పనులు చేయించారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



భూలక్ష్మి దేవికి ప్రత్యేక పూజలు

చందూరు, న్యూస్‌టుడే: మోస్రా మండల కేంద్రంలో శుక్రవారం భూలక్ష్మీ దేవీ పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వీడీసీ ఛైర్మన్ సాయిలు, పోతారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.


మోస్రాలో..


కార్యక్రమంలో పాల్గొన్న టాంకాం ప్రతినిధులు

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: సాంకేతిక విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని టాంకాం ప్రతినిధి విశాల్ పేర్కొన్నారు. టాంకాం ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి శుక్రవారం ప్రభుత్వ బాలుర ఐటీఐలో నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ యాదగిరి, బాలిక ఐటీఐ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శివరావు, శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

ఆర్థికసాయం అందజేత

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఇటీవల ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో మునిగి చనిపోయిన ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ప్రశాంత్ కుటుంబాన్ని పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు వికాస్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. తన వంతు సాయంగా రూ.25 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. డీసీసీ డెలిగేట్ సుధాకర్, మోహన్ తదితరులు ఉన్నారు.

నేడు రేబిస్ టీకాలు

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లీ జిల్లా పశువైద్యశాలతో పాటు మున్సిపల్ పరిధిలో ఏరియా వైద్యశాలలు, మండల పశువైద్యశాలల్లో వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు

మోపాల్: మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఓ విద్యార్థిని తండ్రి చరవాణికి సందేశం పంపడంపై విద్యాశాఖ తరఫున చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మోపాల్, న్యూస్‌టుడే: జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో శుక్రవారం జిల్లా నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఛైర్మన్ శ్రీకాంత్ తెలిపారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా వైస్ ఛైర్మన్లుగా నవీన్(మంచిప్ప), బాలరాజ్, ప్రధాన కార్యదర్శులుగా సురేష్, గంగాధర్, కన్వీనర్‌గా రాజాప్రదీప్, కో కన్వీనర్‌గా రంజిత్ ఎన్నికయ్యారు.

సమ్మేళనం జయప్రదానికి పిలుపు

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: గిరిరాజ్ కళాశాలలోని కళాతోరణం ఆడిటోరియంలో శనివారం నిర్వహించే పూర్వవిద్యార్థుల సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం సమన్వయకర్త దండు స్వామి పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. 1956 నుంచి 2023 వరకు కళాశాలలో డిగ్రీ, పీజీ చదివిన వారందరు హాజరుకావాలని పేర్కొన్నారు.

వారసత్వ సంపద కాపాడాలి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యార్థులు వారసత్వ సంపదను కాపాడేందుకు కృషి చేయాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ అబ్దుల్ రఫీక్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గిరిరాజ్ కళాశాలలో యువ టూరిజం క్లబ్ ఏర్పాటు చేశారు. చరిత్ర అధ్యాపకులు గంగామోహన్, అధ్యాపకులు వినయ్‌కుమార్, రంజిత, సమన్వయకర్త దస్తప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

ఎడపల్లి, న్యూస్‌టుడే: బోధన్-నిజామాబాద్ మార్గంలో బస్సుల సంఖ్య పెంచి ప్రతి స్టేజీలో ఆపేలా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులు ఆర్టీసీ సిబ్బందికి విన్నవించారు. మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణం బురదమయంగా మారుతుందని సమస్య తీర్చాలని ఆయుష్ వైద్యుడు వెంకటేష్, పర్యవేక్షకుడు రాజేశ్వర్ అధికారులను కోరారు. శిఖం భూముల్లో కబ్జాలు జరగకుండా చూడాలని ఏవో సిద్ధిరామేశ్వర్ జల వనరుల శాఖ ఏఈ రాజ్యలక్ష్మిని కోరారు. ఎంపీడీవో శంకర్, ఎంపీవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రాత పరీక్ష

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నిజామాబాద్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల డీలర్ల పోస్టుల భర్తీకి శుక్రవారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 38 పోస్టులకు 418 మంది దరఖాస్తు చేసుకోగా స్థానిక రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన పరీక్షకు 393 మంది హాజరయ్యారు. ఆర్డీవో రాజేంద్రకుమార్ పర్యవేక్షించారు.

ANDHRA PRADESH STATE FINANCIAL CORPORATION
NIZAMABAD BRANCH
PUBLIC NOTICE

The General Public / Financial Institutions / Banks are hereby informed by M/s. APSFC, Nizamabad Branch that Sri Billa Sai Krishna, S/o. Late B.Gangadhar, R/o. H.No.1-2-14/2, Pati Gally, Nizamabad Town & District has agreed to offer the following Schedule Property as Collateral Security by way of Deposit of Title Deeds to M/s APSFC, Nizamabad Branch against proposed sanction of a Term Loan of Rs.20.00 Lakhs to M/s.Mallikarjuna Electricals D.No.7-9-817, Devi Road, Nizamabad Town & District represented by its proprietor Sri Billa Sai Krishna, S/o. Late B.Gangadhar, R/o. H.No.1-2-14/2, Pati Gally, Nizamabad Town & District. The Surety is entitled to the schedule property by virtue of Regd. Sale Deed Doc. No.5865/2024, dated 12.07.2024 with the office of the Sub-Registrar Nizamabad Rural, Dist. Reg. Nizamabad. Except these documents he is not having any other Documents for the schedule property and he is the sole owner of these properties. Hence, anyone having any objections for this proposed mortgage may kindly intimate the undersigned in writing within Seven Days from the date of this notification. Otherwise this property will be construed as having clear title and will be taken for Mortgage and subsequent objections if any will not be entertained/ binding to us.

SCHEDULE OF PROPERTY

All that Residential Open Plots Nos. 92 (Part) & 93 admeasuring 481.58 Sq.Yards, as per T.L.P.No.107/2020/H E.P. No.19509/505/2020/H, issued by DTCP Hyderabad, covered by Sy.No.319,320 & 320/AA, situated at Nadipally Thanda (V & GP), Dichpally (M), Nizamabad District and bounded by: North : Part of Plot No.92, South : Plot No.94, East : Land of Neighbours West : 33'-00" Wide Road

Sd/- **SENIOR BRANCH MANAGER**
A.P. State Financial Corporation
(Ph.No.08462-295727,9866384171)
NIZAMABAD BRANCH,
OPP:ZILLAPARISHAD, NIZAMABAD DISTRICT

ఎన్‌సీసీ శిబిరంలో అగ్నిమాపక తరగతులు

నిజామాబాద్ క్రీడావిభాగం : నగరంలోని నాగారంలో ఎన్‌సీసీ 12వ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక శిక్షణ శిబిరంలో శుక్రవారం అగ్నిమాపకశాఖ పనితీరును వివరించారు. అగ్నిని అదుపు చేయడానికి ఎలాంటి చర్యలు చేపడతారో ప్రత్యక్షంగా చూయించారు. నిజామాబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ నర్సింగ్‌రావు ఇళ్లలో జరిగే సిలిండర్, విద్యుత్తు ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలో తెలిపారు.


మంటలు ఆర్పే విధానం తెలుపుతున్న అగ్నిమాపక సిబ్బంది

అర్హులను సంఘంలో చేర్పించాలి

నిజామాబాద్ కలెక్టరేట్ : అర్హులైన మహిళలను సంఘంలో సభ్యులుగా చేర్పించాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా సమాఖ్య 8వ వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యదర్శి లావణ్య ఆడిట్ నివేదిక చదివి వినిపించారు. మహిళలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందించి ఆర్థికంగా తోడ్పాటు అందించాలని డీఆర్‌డీవో పేర్కొన్నారు. సమావేశంలో ఏపీడీ రవీందర్, డీపీఎంలు శ్రీనివాస్, సాయిలు, సంధ్యారాణి, నీలిమ, మారుతి, రాచయ్య, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్, ఏపీఎం సరోజిని, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, కోశాధికారిణి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

డీఎస్‌కు నివాళులు

నిజామాబాద్ నగరం: డి.శ్రీనివాస్ జయంతి సందర్భంగా నగర బైపాస్ సమీపంలోని సమాధి వద్ద ఎంపీ అర్వింద్ నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, శ్రావణ్, బస్వా లక్ష్మీనర్సయ్య తదితరులున్నారు.

భూ కబ్జాలు నివారించాలి

ఖలీల్‌వాడి: తెవివి భూముల కబ్జా కుట్రలను నివారించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

ఉరేసుకొని ఆత్మహత్య

వర్ని, న్యూస్‌టుడే: శ్రీనగర్ గ్రామానికి చెందిన లీలావతి(41) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం బోధన్ దవాఖానాకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మస్కట్‌లో రామడుగు వాసి మృతి


గంగాధర్

రామడుగు(ధర్పల్లి), న్యూస్‌టుడే: రామడుగుకు చెందిన బద్దుల గంగాధర్ (48) ఉపాధి కోసం మస్కట్ వెళ్లారు. ఐదు రోజుల క్రితం మూర్ఛ రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ చనిపోయినట్లు స్థానికులు చెప్పారు. మూడు నెలల క్రితం సెలవులో వచ్చి వెళ్లాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి రాగా అంత్యక్రియలు నిర్వహించారు.

వీధి కుక్క దాడి.. పది మందికి గాయాలు

నిజామాబాద్ గ్రామీణం : కొండూరులో ఓ వీధి కుక్క స్వైరవిహారం చేసి పది మందిపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిలో చిన్నారులు పెద్దలు ఉన్నారు. బాధితులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

మృతదేహం లభ్యం

వర్ని : అదృశ్యమైన వ్యక్తి మృతదేహంగా లభ్యమైనట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పొతంగల్‌కు చెందిన మొగులయ్య(44) ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చందూర్ మండలంలో కొత్తగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ పరిసర ప్రాంతంలోని ఉపకాలువలో పురుషుడి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించి వర్ని పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని బోధన్ దవాఖానాకు తరలించి పలు ఠాణాలకు తెలియజేశారు. పొతంగల్‌లో ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు మృతదేహం మొగలయ్యదే అని గుర్తుపట్టారు.

గొలుసు చోరీ చేసిన మహిళలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని గొలుసును మరో ఇద్దరు స్త్రీలు లాక్కొని పారిపోయిన ఘటన మూడో ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లికి చెందిన ఆర్ల భూలక్ష్మి నిజామాబాద్ బస్టాండ్ నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. అప్పటికే ఆ ఆటోలో ఇద్దరు మహిళలు ఉండడంతో ఆమెకు ఎలాంటి అనుమానం రాలేదు. డ్రైవర్ ఆటోను కంఠేశ్వర్ నుంచి బైపాస్ రోడ్డు మీదుగా గౌతంనగర్ తీసుకెళ్లారు. ఆటోలోని ఇద్దరు మహిళలు భూలక్ష్మి మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని ఆమెను బయటకి నెట్టేసి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు.

క్రైమ్ కార్నర్

ఇసుక నిల్వల జప్తు

పొతంగల్, న్యూస్‌టుడే: పొతంగల్ మంజీర నదిపై రెండో వంతెన సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన 60 ట్రాక్టర్ల ఇసుక డంపును శుక్రవారం జప్తు చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. ఈ నిల్వలకు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.

టిప్పర్ పట్టివేత

పొతంగల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను భాకర్‌ఫారం వద్ద పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. గురువారం రాత్రి సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా టిప్పర్ పట్టుబడిందన్నారు.

రుద్రూర్: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాలీ ఆటోను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న శుక్రవారం తెలిపారు. కోటగిరి మండలం నుంచి వర్ని వైపు తరలిస్తుండగా పోలీసులు రుద్రూర్‌లో అడ్డుకొని ఠాణాకు తరలించారు. తహసీల్దార్ తారాబాయి రూ.5 వేల జరిమానా విధించారు.

కంజరలో కొనసాగుతున్న పోలీసు పికెటింగ్

మోపాల్: కంజరలో రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న వివాదంలో నరహరి హత్యకు గురైన విషయం తెలిసిందే. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు పికెటింగ్‌ను కొనసాగిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ శుక్రవారం తెలిపారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌బాబు



బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ గ్రామీణ సీఐగా విజయ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన నరేష్ హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి బదిలీకావడంతో జిల్లా కేంద్రం ఒకటో ఠాణాలో విధులు నిర్వహిస్తున్న విజయ్‌బాబును ఇక్కడకు బదిలీచేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నీరు నిల్వకుండా చూడాలి


కుండీలో నీటిని తొలగిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంటి పరిసరాలు, నివాసాలలో నీరు నిల్వకుండా చూసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్ సూచించారు. మామిడిపల్లిలో శుక్రవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానికులకు అవగాహన కల్పించారు. నీటి నిల్వలతో దోమల వృద్ధి చెంది మలేరియా, వైరల్ ఫీవర్, డెంగి వంటి వ్యాధులు వస్తాయని వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకొని దోమలు కట్టకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. సబ్ యూనిట్ అధికారి సాయి, ఆరోగ్య కార్యకర్త మోహన్, జగ్గీవన్, పాల్గొన్నారు.

ఆర్మూర్
● ఆర్మూర్ ● బాల్కొండ

సైన్స్ మేళాలో అంకాపూర్‌కు ద్వితీయస్థానం

వేల్పూర్(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో నిర్వహించిన సైన్స్ మేళాలో అంకాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు తయారు చేసిన వరి ఆరబోత యంత్రానికి ద్వితీయ బహుమతి వచ్చింది. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరి, సైన్స్ ఉపాధ్యాయులు రఘునాథ్ తెలిపారు.


విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా..
94939 26837
98666 11160

మాక్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాంచంద్రపల్లి మూలమలుపు వద్ద పచ్చిముళ్లు పెరిగి రోడ్డు కుదించుకుపోయింది. మొక్కలు తొలగించాలి.
-మహేష్, రాంచంద్రపల్లి
సమాధానం: వెంటనే తొలగించి మలుపు వద్ద సూచికలు ఏర్పాటు చేస్తాం.
-శ్రీనివాస్, ఎంపీవో

మాక్లూరు గ్రామీణం: ఆర్టీసీ కాలనీలో కాలువలు లేక మురుగు రోడ్డుపై పారుతోంది కాలువ నిర్మించాలి. -రాజేందర్
సమాధానం: మురుగు కాలువలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం.
-నిఖిల్, పీఆర్ ఏఈ

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ పట్టణంలోని తిరుమల కాలనీ వీధి నెంబర్ 1లో మూడు నెలలుగా మిషన్ భగీరథ నీరు లీకవుతోంది. దారి బురదమయంగా మారుతోంది.
- రమేశ్, స్థానికుడు
సమాధానం: సిబ్బందిని పంపిస్తాం. పరిశీలించి, నీరు లీకేజీ అవ్వకుండా చర్యలు చేపడతాం. - రాజు, పుర కమిషనర్, ఆర్మూర్

ఆర్మూరు గ్రామీణం: మామిడిపల్లి సరస్వతీనగర్‌లో మురుగు కాల్వలు చెత్తతో పేరుకుపోయాయి. ఇబ్బందులు పడుతున్నాం. -కార్తీక్
సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్తను తొలగించి సమస్యను పరిష్కరిస్తాం.
- గజానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆర్మూర్

ఆర్మూరు గ్రామీణం: కోటార్మూర్ ఇంది రమ్మ కాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. - రాజేశ్వర్
సమాధానం: వెంటనే సిబ్బందిని పంపి మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం.
- గజానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

భీమ్‌గల్ గ్రామీణం: ముచ్కూర్ గ్రామంలోని కుర్మగల్లీలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. . -గ్రామస్థులు
సమాధానం: కాలువ శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం.
-సతీష్, పంచాయతీ కార్యదర్శి

భీమ్‌గల్: బాపూజీనగర్‌కు చెత్తను తరలించే వాహనం రావడం లేదు. చెత్త పేరుకుపోయింది. -షేక్ మహమ్మద్
సమాధానం: వెంటనే చెత్త సేకరించే విధంగా చర్యలు తీసుకుంటాం. -రామకృష్ణ, భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్

భీమ్‌గల్: లింబాద్రి గుట్టకు వెళ్లే బైపాస్ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు.
-రాజారాం, పురాణిపేట
సమాధానం: సిబ్బందికి చెప్పి వెంటనే ఏర్పాటు చేయిస్తాం. -మల్లేషం, ఇన్‌చార్జి కార్యదర్శి

ఏర్గట్ల: మా ఇంటి ముందున్న మురుగు కాలువను కొన్ని రోజులుగా శుభ్రం చేయడం లేదు. దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నాం. - శ్రీనివాస్, తడపాకల్
సమాధానం: కార్మికురిద్దరికి జ్వరం రావడంతో విధులకు హాజరు కాలేదు. మిగతా వారితో శుభ్రం చేయిస్తాం.
- రాకేశ్, పంచాయతీ కార్యదర్శి

మురుగు కాలువలు శుభ్రం

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్‌లోని వేంకటేశ్వర కాలనీలో సక్రమంగా మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించారు. శుక్రవారం మురుగు కాలువలను శుభ్రం చేశారు.



అమ్దాద్ (మాక్లూర్ గ్రామీణం): మాక్లూర్ మండలం అమ్దాద్‌లో మురుగు కాలువలు శుభ్రంగా లేక దోమల స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీవో శ్రీనివాస్ పంచాయతీ సిబ్బందితో మురుగు కాలువలు శుభ్రం చేయించారు.



వీధి దీపాల ఏర్పాటు

నందిపేట్: నందిపేట్‌లోని రాజ్‌నగర్ దుబ్బాల్లో దీపాలు వెలగడం లేదని, రాత్రి పూట బయటకు వెళ్లడానికి ఇబ్బంది ఉందని కాలనీవాసులు 'మేమున్నాం మీకు తోడుగా'కు చెప్పారు. పంచాయతీ సిబ్బంది శుక్రవారం వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

చెట్ల కొమ్మల తొలగింపు

భీమ్‌గల్ గ్రామీణం: చేంగల్ గ్రామం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ దగ్గర చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలకు తాకుతున్నాయని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ సిబ్బందితో తొలగింపజేశారు.

గుంతలు పూడ్చారు

ఆర్మూర్ గ్రామీణం: ఆలూర్ మండలం దేగాంలో సీసీ రోడ్డుపై గుంతలు పడ్డాయని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సిబ్బందితో రోడ్డుపై గుంతలను మొరంతో పూడ్చి వేయించారు.

సిబ్బంది కొరత..రోగులకు వెత!


మోర్తాడ్ సామాజిక ఆరోగ్య కేంద్రం

మోర్తాడ్(ఏర్గట్ల), న్యూస్‌టుడే: మోర్తాడ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరోగ్య సమస్యలతో వచ్చిన రోగులు సంబంధిత వైద్యులు లేకపోవడంతో అసహనంతో వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతానికి ఓపీ సేవలు మాత్రమే కొనసాగుతున్నాయి. పాము, తేలు, కుక్కకాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. టీహబ్ ద్వారా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో సుమారు 20 వరకు ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి.

ఎనిమిది పోస్టులు ఖాళీ

సీహెచ్‌సీకి 27 పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా జనరల్ సర్జన్, పీడియాట్రిషన్, అనస్తీషియన్, గైనకాలజిస్టు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా స్టాఫ్ నర్సులు ఏడుగురు ఉండాలి.. కానీ ఐదుగురు ఉన్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యుల నియామకాల విషయమై ఆరా తీయగా గతంలో సీహెచ్‌సీలు వైద్యారోగ్యశాఖ పరిధిలో ఉండేవని, ప్రస్తుతం వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి వచ్చాయని, నియామకాలకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా రాలేదని వైద్యాధికారి సమాధానమిచ్చారు. ఇటీవల జిల్లా పాలనాధికారి తనిఖీకి వచ్చినప్పుడు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

కేంద్రం ఆవరణలో ఆక్సిజన్ ప్లాంటు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. ప్రస్తుతానికి ఇది నిరుపయోగంగా ఉంది. ఈ విషయమై వైద్యాధికారి 'న్యూస్‌టుడే' వివరణ అడగగా అత్యవసర సేవల కింద ఉపయోగిస్తున్నామన్నారు. క్రిటికల్ కేసుల విషయంలో రోగులకు ఆక్సిజన్ పెట్టి ఆసుపత్రులకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.



మందులన్నీ అందుబాటులో ఉన్నాయి
- ప్రవీణ్, మండల వైద్యాధికారి



సీహెచ్‌సీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు సేవలు కొనసాగుతున్నాయి. 30 పడకలు అందుబాటులో ఉన్నాయి. నిత్యం వందకు పైగా ఓపీ నిర్వహిస్తున్నాం. వ్యాక్సినేషన్ పాయింట్ ఉండటంతో అన్ని రకాల వ్యాక్సిన్లు ఉన్నాయి. ల్యాబ్ ద్వారా అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నాము. ప్రస్తుతానికి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రసవాలు బంద్

ప్రసవాలు చేయడానికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు, పరికరాలు ఉన్నప్పటికీ స్త్రీవైద్య నిపుణులు(గైనకాలజిస్టు), పిల్లల వైద్య నిపుణులు(పీడియాట్రిషన్) పోస్టులు ఖాళీలు ఉన్నాయి. గత మూడు నెలలుగా ప్రసవాలు జరగడం లేదు. గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. తమపై ఆర్థికభారం పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆర్మూర్, న్యూస్‌టుడే: ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉదయం జిల్లా పాలనాప్రాంగణంలో జరిగే జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్ష సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం నందిపేట్‌లోని ప్రసిద్ధ కేదారేశ్వరాశ్రమంలో జరిగే రాష్ట్రీయ హిందూ వాహిని మహా సమ్మేళనంలో, నందిపేట్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

పర్యాటకంగా అభివృద్ధి చెందాలి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యువ టూరిజం క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వరల్డ్ టూరిజం డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.వేణు ప్రసాద్ మాట్లాడుతూ పర్యాటకంగా ఇందూర్ అభివృద్ధి చెందాలన్నారు. చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవన్న పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యం గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డా.సునీత, సమన్వయకర్త వెంకటేశ్వర్లు, అంబర్ సింగ్, లింగన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన వరంగల్ రైతులు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో పంట క్షేత్రాలను శుక్రవారం వరంగల్ జిల్లా రైతులు సందర్శించారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాబార్డు ఆర్థిక సహకారంతో 'దీర్ఘకాల పంట ఉత్పాదకతే నేల ఆరోగ్య యాజమాన్య పద్ధతులు'పై అవగాహన కోసం రైతు విజ్ఞాన యాత్రలో భాగంగా గ్రామాన్ని సందర్శించారు. పసుపు, మొక్కజొన్న, సోయా, కూరగాయ పంటలు పరిశీలించారు. సాగు విధానాలు, దిగుబడి గురించి స్థానిక రైతులతో చర్చించారు. మొక్కజొన్న కోత తర్వాత పంటను నేలలో కలియ దున్నడం ద్వారా సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది నేల ఆరోగ్యంగా ఉంటుందని రైతులు వివరించారు. గురిడి రెడ్డి సంఘం అధ్యక్షుడు అనంత్, కార్యదర్శి నారాయణరెడ్డి, కేకే భాజన్న, నర్సారెడ్డి, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త డా॥ రాములు, వ్యవసాయ విస్తీర్ణాధికారి సవిత పాల్గొన్నారు.


పసుపు పంట క్షేత్రంలో రైతులు

ప్రగతి పనులకు నిధులివ్వాలని వినతి

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిపేట్ మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్‌ను కలిసి సన్మానించారు. కంఠం గ్రామానికి సిమెంట్ రోడ్డుకు రూ. 20 లక్షల నిధులివ్వాలని విన్నవించారు. తల్వేదకు వెళ్లే మూడు కిలోమీటర్ల వెంబడి రహదారిని విస్తరించాలని, ఎత్తిపోతల పథకం వరకు రోడ్డు వేయించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు, దేగంగంగారెడ్డి, పురాన్‌రెడ్డి, పిప్రెర సాయారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.


పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నందిపేట్ నాయకులు

మాక్లూర్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దాదన్నగారి అమర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జంగిడి సతీష్ శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు.

కమ్మర్‌పల్లి: మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో సన్మానించారు. పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్, శివన్నోళ్ల శివకుమార్, పడిగెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ గ్రామీణం: మహేశ్‌కుమార్‌గౌడ్‌ను భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలిసిన వారిలో జాగిర్యాల్‌కు చెందిన చిన్నారెడ్డి, శ్రీనివాస్, విఠ్ఠేష్, పాల్యా శివ తదితరులున్నారు.

వేల్పూర్ ఎంఈవోగా రేణుక

వేల్పూర్(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: వేల్పూర్ ఎంఈవోగా రేణుక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అక్లూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తూ ఇన్‌చార్జి ఎంఈవోగా నియమితులయ్యారు.

అవీ..ఇవీ.. అన్నీ

భాజపాలో చేరిక

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి భారాస మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు చింత గణేష్ శుక్రవారం భాజపాలో చేరారు. ఎంపీ అర్వింద్ ధర్మపురి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మల్లికార్జునరెడ్డి, కమలాకర్ పాల్గొన్నారు.



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని బాధిత కుటుంబాలను ఎంపీ అర్వింద్ శుక్రవారం కలిసి పరామర్శించారు. ఈరవత్రి రాజశేఖర్, రూపారి నర్సయ్య కుటుంబాలను కలిసి ఓదార్చారు.

రుణాల పంపిణీ

వేల్పూర్(కమ్మర్‌పల్లి): పచ్చలనడ్కుడ సొసైటీలో 200 మంది రైతులకు రూ.80 లక్షల పంట రుణాలను ఛైర్మన్ గడ్డం లింబాద్రి పంపిణీ చేశారు. సొసైటీ జనపదసభలో ఆయన మాట్లాడారు. 660 మంది రైతులకు డూ.. 200 మందికి రుణమాఫీ వర్తించిందన్నారు. డైరెక్టర్లు నర్సారెడ్డి, తలారి శేఖర్, రమన్న, గంగాధర్ పాల్గొన్నారు.

రాత పుస్తకాల అందజేత

నందిపేట్: మాజీ మంత్రి శ్రీనివాస్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని మారంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భాజపా నాయకుడు గంగాధర్ రాత పుస్తకాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, సంతోష్, బాలరాజు, గణేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన చేప పిల్లలు పంపిణీ చేయాలి

నందిపేట్: ప్రభుత్వం వెంటనే మత్స్యకారులకు నాణ్యమైన చేప పిల్లలు పంపిణీ చేయాలని జిల్లా గంగపుత్ర అభివృద్ధి సంఘం నాయకులు సాయిలు అన్నారు. డొంకేశ్వర్‌లో శుక్రవారం సంఘ సమావేశం నిర్వహించారు. రవికుమార్, బాలయ్య, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.500 బోనస్ ఇవ్వాలి

ఆర్మూర్ పట్టణం: సన్నాలు, దొడ్డు ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు ప్రభాకర్, దేవారాం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్మూర్ కుమార్ నారాయణ భవన్‌లో నిర్వహించిన మాట్లాడారు. రాజన్న, గంగారాం, రమేశ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

సొసైటీలో తీర్మానం

మోర్తాడ్: ధాన్యానికి రూ.500 బోనస్‌పై మహాజన సభలో మోర్తాడ్ సొసైటీ పాలకవర్గం తీర్మానం చేసింది. మోర్తాడ్ సొసైటీలో మహాజన సభను ఏర్పాటు చేశారు. ఏఎంసీ కమ్మర్‌పల్లి డైరెక్టర్లు నూతనంగా ఎన్నికైన మహిపాల్‌ను సంఘ సభ్యులు సన్మానించారు. సొసైటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నవీన్, భూమారెడ్డి, సాయన్న, అశోక్‌రెడ్డి, భూమేశ్వర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆటలపోటీలు



కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లిలో మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు కొనసాగుతున్నాయి. వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా హోరాహోరీగా తలపడుతున్నారు. ఇప్పటికే వాలీబాల్, కబడ్డీ ఆటలు తుది దశకు వచ్చాయి.

క్రీడా పరికరాల వితరణ

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ ఉన్నత పాఠశాలకు క్రికెట్, ఎరువుల సంస్థ క్రీడాపరికరాలు వితరణ చేసింది. ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య సంస్థ ప్రతినిధి లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం అందించారు. సొసైటీ ఛైర్మన్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన రోడ్డు పరిశీలన

వేల్పూర్(కమ్మర్‌పల్లి): వేల్పూర్ -రామన్నపేట గ్రామాల మధ్య ఇటీవల వర్షాలకు తెగిన రోడ్డును ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. రోడ్డు పునరుద్ధరణ పనులు చేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

తొర్తి(ఏర్గట్ల): పోషణ్ మాసం వారోత్సవాల్లో భాగంగా ఏర్గట్ల మండలం తొర్తి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం అన్నప్రాసనలు నిర్వహించారు. ఏఎస్ఐ గంగాధర, మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధి సౌమ్య, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సరస్వతి, అంగన్వాడీ టీచర్లు ప్రేమలత, లక్ష్మి పాల్గొన్నారు.

'కుల వివక్ష పాటిస్తే సహించేది లేదు'

ఆర్మూర్ గ్రామీణం: సుర్బిర్యాల్ మాజీ సర్పంచి సవిత కుటుంబసభ్యులపై గ్రామాభివృద్ధి కమిటీ కుల వివక్ష పాటిస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ అన్నారు. శుక్రవారం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

30న చలో హైదరాబాద్


వెల్మల్‌లో గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 30న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా నందిపేట్ మండలం వెల్మల్‌లో శుక్రవారం గోడప్రతులు ఆవిష్కరించారు. ఒప్పంద ఉద్యోగులు, కార్మికులను శాశ్వత ప్రతిపాదికన నియమించాలని, బీడీ కార్మికులకు రూ. 4 వేల పింఛన్ ఇవ్వాలని, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్, చిన్నగంగాధర్, చాంద్‌పాషా, మైనుద్దీన్, ఖాసీం, గంగారాం పాల్గొన్నారు.

ఆర్మూర్ గ్రామీణం: మామిడిపల్లిలో గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ, వెంకటేష్, గంగామణి, లక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సహాయకులకు శిక్షణ

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో మిషన్ భగీరథలో పని చేస్తున్న సహాయకులకు బాల్కొండ రైతు వేదికలో శుక్రవారం శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ అబ్దుల్ రజాక్ ప్రారంభించారు. చేతి పంపులు, ప్యానెల్ బోర్డులు, పైపు లైన్ల మరమ్మతులపై శిక్షణ ఇస్తున్నారు. ఎంపీవో గంగామోహన్, మిషన్ భగీరథ ఏఈ బస్వారాజు, బాల్కొండ పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ఆర్మూర్ గ్రామీణం: పట్టణ పద్మశాలి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో భాజపా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికలకు క్రీడా పరికరాలు అందజేశారు. నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన పద్మశాలీ విద్యార్థులు సాయి, సుశృత్‌రాజ్, మహిత రాణి, శ్రీకరన్‌లను సన్మానించారు. సేవా సమితి అధ్యక్షుడు మోహన్‌దాస్, ప్రధాన కార్యదర్శి రమాకాంత్, పాఠశాల ఇన్‌చార్జి ప్రత్యేక అధికారిణి నవనీత, వీణ, ప్రవీణ, నారాయణ పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు



పోచంపాడ్ (బాల్కొండ), న్యూస్‌టుడే: మెండోరా మండలం పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా శుక్రవారం సఫాయి మిత్ర ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ముప్కాల్, నల్లూర్, బుస్సాపూర్, నెహ్రూనగర్ కాలనీ, దూదేగాం, పోచంపాడ్‌లకు చెందిన పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు రాకేశ్ పాల్గొని 57 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

గొలుసు చోరీ చేసిన మహిళలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడలోంచి మరో ఇద్దరు మహిళలు గొలుసు లాక్కొని పారిపోయిన ఘటన మూడో టౌన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్తి బాల్మణి నిజామాబాద్ బస్టాండ్ నుంచి ఒడ్యాట్‌పల్లి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. అప్పటికే ఆ ఆటోలో ఇద్దరు మహిళలు ఉండటంతో ఎలాంటి అనుమానం రాలేదు. డ్రైవర్ ఆటోను కంఠేశ్వర్ నుంచి బైపాస్ రోడ్డు మీదుగా గౌతంనగర్ తీసుకెళ్లారు. అక్కడ ఇద్దరు మహిళలు బాలమణి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని ఆటోను బయటకు నెట్టేసి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

జీవో 25ని సవరించాలి

బాల్కొండ, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి తీసుకొచ్చిన జీవో నంబర్ 25ని సవరించాలని ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. మెండోరా, ముప్కాల్ మండల విద్యాధికారులుగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్, రవిశంకర్‌లను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు శుక్రవారం సన్మానించారు. మోహన్, రఘు, సాయిలు, విశాల్, రాజేష్, రవికుమార్ ఉన్నారు.


నందిపేట్‌లో...


కమ్మర్‌పల్లి: పసుపు పరిశోధన కేంద్రంలో...


బాల్కొండ పద్మశాలి సంఘంలో...


పోచంపాడ్‌లోని జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో...

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం ఆర్మూర్ పట్టణంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుర కమిషనర్ రాజు, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, కౌన్సిలర్లు, బీసీ సంఘం నాయకులు, డీఎస్పీ ప్రతినిధులు, న్యాయవాదులు, భాజపా నాయకులు పాల్గొన్నారు.

నందిపేట్ గ్రామీణం: అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులర్పించారు. ప్రిన్సిపల్ ఆర్మల చిన్నయ్య, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పసుపు పరిశోధన స్థానంలో శాస్త్రవేత్త మహేందర్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు.

భీమ్‌గల్: భీమ్‌గల్ పురపాలక సంఘంలో బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఛైర్ పర్సన్ ప్రేమలత, మున్సిపల్ కమిషనర్ వై. రామకృష్ణ, కౌన్సిలర్లు లింగయ్య, అబ్దుల్‌రజాక్, మున్సిపల్ మేనేజర్ నరేందర్ పాల్గొన్నారు.

ఏర్గట్ల: ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్, జూనియర్ అసిస్టెంటు జాకబ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగామోహన్ తదితరులు నివాళులర్పించారు. బాల్కొండ,కిసాన్‌నగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కుందారపు శ్రీనివాస్, మధుకర్, నాగభూషణం పాల్గొన్నారు.

మెండోరా(బాల్కొండ): మండల పరిషత్ కార్యాలయం, జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఎంపీడీవో వనజ, ఇంజినీర్లు గంగారాం షిండే, నితిన్‌సింగ్, హేమలత, శృతిమా, మంజుల, శ్రీకాంత్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్: నందిపేట్‌లో బాపూజీ జయంతిని నిర్వహించారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు రాజశేఖర్, బామేష్, గంగాధర్ పాల్గొన్నారు.


ఆర్మూర్ బల్దియాలో...


కమ్మర్‌పల్లిలో విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి


ఆర్మూర్: భాజపా ఆధ్వర్యంలో...


అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ...


ఆర్మూర్ బార్ అసోసియేషన్‌లో..


భీమ్‌గల్ మున్సిపాలిటీలో..